క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బాబుల్‌రెడ్డినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు, సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు కోత ఉంటుందన్నారు. కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్-1,2 పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 11కేవీ ఫీడర్-1,2,3,4,5,6, మురళీ హోటల్ ఫీడర్, దుర్గామాత ఫీడర్, సిటీజన్‌కాంట ఫీడర్, నేతాజీనగర్ ఫీడర్, శ్రీసాయిరామ్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. ప్రజలు గమనించాలని అధికారులు కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అత్తాపూర్: అగర్వాల్ సేవా దళ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. 113వ మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రజలంతా ఉపయోగించుకోవాలన్నారు. కంటి, దంత, చెవి, ఆర్థోపెడిక్, కార్డియోలజీ, ఈసీజీ, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. అంతే కాకుండా ఉచితంగా మందులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని హైదర్‌గూడతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అత్తాపూర్: పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వం అని శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు వెల్లడించారు. 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివేకానంద, మాణిక్యంరెడ్డి, డి.సురేష్, ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్, టి.సత్యనారాయణలు మాట్లాడుతూ శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91వ బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులమంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 33 సంవత్సరాల తరువాత మొదటిసారి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి కలవబోతున్నట్లు వెల్లడించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

మంచిరేవులలో రోడ్ వార్

- శాఖల మధ్య సమన్వయలోపం
- ఓ శాఖతో అనుమతులు లేకుండానే పనులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మున్సిపల్ కమిషనర్
- దేవాదాయశాఖ అధికారిపై కేసు



రోడ్డుపై వేసిన మెటీరియల్‌ను తొలగిస్తున్న దేవాదాయశాఖ అధికారులు



దేవాదాయశాఖ అధికారులతో వాదనకు దిగిన కీర్తి విల్లాస్ నివాసితులు

మణికొండ: తమ శాఖకు చెందిన భూమిలో మున్సిపాలిటీ వారు రోడ్డు వేయడం ఏమిటని, తమ అనుమతులు లేకుండా ఎలా వేస్తారంటూ దేవాదాయ శాఖ అధికారులు పనులను మరోమారు అడ్డుకున్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి శ్రీమచిలేశ్వరస్వామి, వీరభద్రస్వామి దేవాలయం వరకు గతంలో పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలో మట్టి రోడ్డు ఉంది. దాన్ని హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో వంద అడుగుల రోడ్డుగా చూపారు. రోడ్డు ప్రస్తుతం భక్తులకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని మున్సిపల్ కౌన్సిల్‌లో గతంలో తీర్మానం చేశారు. అపుడే పనులు ప్రారంభిస్తే దేవాదాయ శాఖ అధికారులు రోడ్డు వేస్తున్న భూమి దేవాదాయశాఖదని, అందులో తమశాఖ అనుమతులు లేకుండా ఎలా వేస్తారని పనులను అడ్డుకోవటంతో పాటు మున్సిపాలిటీ మీద ఏకంగా నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడితో పనులు నిలిచిపోవటంతో ఇరు శాఖలు మిన్నకున్నాయి. అటు దేవాదాయ, ఇటు మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు ఈ విషయంలో ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వటంలో విఫలం కావటంతో ఇరు శాఖల కింది స్థాయి అధికారులు ప్రజల ముందు పలుచన అయ్యేలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తాము వేసిన రోడ్డు మెటీరియల్‌ను తొలగించినందుకు నార్సింగి మున్సిపల్ కమీషనర్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు దేవాదాయ శాఖ ఈఓపై కేసు నమోదు చేశారు.

కోర్టు ఆదేశాలు ఉన్నాయని...

ప్రస్తుతం అదే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోర్టు మున్సిపల్ శాఖను ఆదేశించిందని మరో మారు పనులను శుక్రవారం నుంచి మొదలు పెట్టారు. దాంతో శుక్రవారం అర్ధరాత్రి దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమీషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్‌లు మధుబాబు, ప్రణీత్‌ల ఆధ్వర్యంలో పది మంది ఈవోలు వచ్చి రోడ్డుపై పోసిన మెటిరియల్‌ను జేసీబీలతో పక్కకు తొలగించారు. శనివారం మరో మారు పనులను నిలిపేందుకు వారు రావటంతో పనులను ఎందుకు అడ్డుకుంటున్నారని, అదే రోడ్డు అవసరం ఉన్న కీర్తి విల్లాస్ నివాసితులు దేవాదాయ శాఖ అధికారులతో వాదనకు దిగారు. రోడ్డు ఎవరు వేస్తున్నారో వారు వచ్చి తమతో మాట్లాడాలని, మీకు సంబంధం లేదని అధికారులు వారికి సూచించారు. పోలీసులు వచ్చి ఇరు వర్గాలను సముదాయించటంతో వెనుదిరిగారు.ఆ రోడ్డు గతంలో పంచాయతీరాజ్ శాఖ రోడ్డుగా ఉందని, ప్రస్తుతం మున్సిపల్ రోడ్డుగా ఉంటుందని జిల్లా పంచాయతీరాజ్ అధికారులు ఆర్టీఐ యాక్టులో అడిగిన వారికి లిఖితపూర్వకంగా తెలిపారు.

కోర్టు ఆదేశాలు లేవు

మంచిరేవుల సర్వేనెంబర్ 303లో ఉన్న దేవాదాయశాఖ భూమిలోనుంచి రోడ్డు వేయాలని ఎలాంటి కోర్టు ఆదేశాలు లేవు. గతంలో దేవాలయానికి పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చిన్నగా రోడ్డు ఉంది. అదే స్థాయిలో అభివృద్ధి చేయాలి తప్ప ఇష్టారాజ్యంగా వెడల్పు చేయటాన్ని తమ శాఖ అంగీకరించటం లేదు. అదే విషయాన్ని మున్సిపల్ కమీషనర్‌కు స్పష్టం చేశాం. అయినా పనులు కొనసాగిస్తుండటంతో అడ్డుకున్నాం. ఇప్పటికీ పనులను మానుకోకపోతే వారిపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తాం.

– నరేందర్, ఈఓ, దేవాదాయశాఖ

కోర్టు ఆదేశాలు ఉన్నాయి

గతంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్న రోడ్డు ప్రస్తుతం మున్సిపల్ శాఖలోకి వస్తుంది.హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో వంద అడుగుల రోడ్డుగా ఉంది. దాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. కీర్తి విల్లాస్‌లలో ఉంటున్న వారు కోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్ పనులు నాలుగువారాల్లోగా పూర్తి చేయాలని ఆదేశించింది. దాంతో రోడ్డు పనులు మొదలు పెట్టాము. ఇప్పటికే డ్రైనేజీ, విద్యుత్ లైన్లు అన్ని ఆ రోడ్డు వారిగా ఉన్నాయి. దేవాలయం పరిసరాలలో మున్సిపాలిటీ నిధులతో రోడ్లు వేయించుకున్న దేవాదాయశాఖ అధికారులు అక్కడకు రోడ్డు ఎందుకు వద్దంటున్నారో పునరాలోచన చేసుకోవాలి.

– బి.సురేందర్‌రెడ్డి, కమీషనర్, నార్సింగి మున్సిపాలిటీ

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు నుంచి కిస్మత్‌పూర్ జంక్షన్ ప్రధాన రహదారికి బీటీ రోడ్డు పని టెండర్ దశలో ఉందన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదేశాలనుసారం హెచ్‌ఎండీఏ నిధులతో బీటీ రోడ్డు పనులకు టెండర్లు పిలిచామన్నారు. అతిత్వరలోపనులు ప్రారంభమవుతాయన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ నిధులతో వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రధాన రహదారికి మట్టి పోసి రోడ సర్వీస్ బాగు చేపించడంతోపాటు లెవెలింగ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో కమీషనర్ శరత్‌చంద్ర, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు అస్లాంబిన్ అబ్దుల్లా, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్, మల్లేష్‌యాదవ్, డీఈ యాదయ్య, ఇంజనీరింగ్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

శంషాబాద్: మున్సిపాలిటీలో గత 25 ఏళ్లుగా వివిధ కేటగిరిల్లో తాత్కాలిక ఉద్యోగులు, సిబ్బందిగా పని చేస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను మున్సిపల్ సిబ్బంది కోరారు. శాసనసభలో ఈ అంశంపై చర్చించి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. కనీసం మూడు సంవత్సరాల అనుభవం ఉన్న వారందరికీ పరిగణలోకి తీసుకోవాలన్నారు. మున్సిపల్ సిబ్బంది నాయకులు డి. నాగేష్ తదితరులున్నారు.

మణికొండ: అంతకు ముందు గ్రామపంచాయతీలు, ప్రస్తుతం మున్సిపాలిటీలలో కార్మికులుగా, సిబ్బందిగా, బిల్‌కలెక్టర్‌లుగా, సూపర్‌వైజర్లు, ఎలక్ట్రిషియన్‌లుగా, వాటర్‌మెన్‌లుగా పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించి ఉత్తమ జీతాలు వచ్చేలా చేయాలని నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. శనివారం మున్సిపల్ వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో వారంతా ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మంచిరేవుల శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ చైర్మెన్ పొన్న రమేష్, మున్సిపల్ సిబ్బంది మహిపాల్, అహ్మద్ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా హరితహారం



మహిళా భవన్ ముందు మొక్కలను పంపిణీ చేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లోని మహిళా భవన్ వద్ద హరితహారంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు మొక్కలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలంతా విరివిగా మొక్కలను నాటాలన్నారు. తమ ఇంటి పరిసరాలతో పాటు రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటాలన్నారు. మొక్కలను నాటి వదిలివేయకుండా అవి ఎదిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నాటిన మొక్కలు ఎదిగితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.రాము, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఓటరునమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఓటరునమోదు కేంద్ర ప్రారంభ కార్యక్రమంలో నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో తేదీల వారిగా ఏర్పాటు చేస్తున్న ఓటరు నమోదు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ మేనేజర్ బీఎస్‌కే రమేష్ కోరారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదుతో పాటు చిరునామాల మార్పు, తప్పులను సరిచేసుకోవటం లాంటి పనులన్నీ అప్పటికప్పుడు పూర్తి చేస్తున్నారన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జె.సిద్దప్ప, ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి.సీతారాం, ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు, బీఎల్‌ఓలు, ప్రజలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ గంధంగూడ, బైరాగిగూడ, హైదర్షాకోట్ ప్రాంతాల్లో గుడిసెలు వేసుకోని జీవిస్తున్న బుడిగే జంగాల సంఘాల వారికి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి వెల్లడించారు. 55 కుటుంబాలకు చెందిన వారు గుడిసెలు వేసుకోని నివసిస్తున్నారని తమకు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శనివారం బుడిగే జంగాల సంఘం నాయకులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: అనారోగ్యంతో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఎంతో ఆదుకుంటోందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట గ్రామానికి చెందిన వడ్ల శ్రీహరికి రూ.60వేల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు వస్తే తనను సంప్రదించాలన్నారు. నాయకులు ఎం. హరిశంకర్, ఎ. మల్లేష్‌యాదవ్, ఎం.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో అన్నదానం



బండ్లగూడ: అన్నిదానాల్లో అన్నదానం ఎంతో గొప్పదని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి అన్నారు. తలారి లక్ష్మణ్ జన్మదినాన్ని పురస్కరించుకోని గంధంగూడలోని శ్రీ జ్ఞాన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గంధంగూడతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ఖానాపూర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నాయకులు

మణికొండ: ఎన్నికల హామీలో బాగంగా రైతులకు ఇచ్చిన హామీ రుణమాఫీ చేయటంతో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి నార్సింగి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లో శనివారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, పీఏసీఎస్ చైర్మెన్ టి. కృష్ణ, నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు

గచ్చిబౌలి: తైక్వాండో పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 7వసౌత్-ఏషియన్, 18వ సౌత్-వెస్ట్ జోనల్ తైక్వాండో ఐటీఎఫ్ చాంపియన్‌షిప్-2023 పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వరకు ఈ పోటీలు కొనసాగుతాయి. తైక్వాండో అసోసియేషన్ తెలంగాణ, తైక్వాండో అసోసియేషన్ కర్నాటక, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఇండియా, యగ్న-యూత్ అవేకెనింగ్ ఫర్ గ్లోరియస్ నేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. రెండవ రోజు వరకు జరిగిన పోటీలలో సాధించిన పతకాలను శనివారం ప్రకటించారు. సౌత్ వెస్ట్ ఇండియా తైక్వాండో పోటీలలో కర్నాటక రాష్ట్రం అత్యధిక పతకాలను సాధించింది. అదేవిధంగా సౌత్ ఏషియన్ పోటీలలో భారత్ అత్యధిక పతకాలను సాధించింది.

సైబర్ నేరాలపై అందరూ పోరాడాలి

- సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర
- సీఐఎస్ఓ కౌన్సిల్ ప్రారంభం

రాయదుర్గం: చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్స్ (సీఐఎస్ఓ) కౌన్సిల్‌ను లాంఛనంగా ప్రారంభించినట్లు సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర శనివారం ప్రకటించారు. ఐఎస్ఏసీఏ హైదరాబాద్ చాప్టర్, హెచ్ఐసీసీ, ఏసీఎఫ్ఈ, హైదరాబాద్ సర్టిఫైడ్ ఫ్రాడ్ ఎగ్జామినర్స్ అసోసియేషన్, ఓడబ్ల్యూఏఎస్పీ హైదరాబాద్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సైబర్ సమ్మిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ సీఐఎస్ఓ కౌన్సిల్‌ను ఓ విప్లవంగా అభివర్ణించారు. సైబర్ సమ్మిట్ ద్వారా వివిధ సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు, సవాళ్ళు పెరిగిపోతున్నాయని, ఈ నేరాలపై అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు.

ఢిల్లీ వెళ్లిన వ్యాపార వేత్త అదృశ్యం



శ్రీధర్‌రావు

శంషాబాద్: స్నేహితుడిని కలవడానికి ఢిల్లీ వెళ్లిన వ్యాపారవేత్త అదృశ్యమయ్యాడు.ఈ సంఘటన ఆర్‌జీఐఏ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విజయవాడకు చెందిన శ్రీధర్‌రావు స్థానికంగా వ్యాపార వేత్తగా స్థిరపడ్డాడు. జులై 16 ఢిల్లీలో ఉన్న స్నేహితులను కలిసేందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు అతడి భార్య శ్రీధర్‌రావును ఎయిర్‌పోర్టులో డ్రాప్ చేసి వెళ్లింది. మరుసటి రోజు ఫోన్ చేసిన శ్రీధర్‌రావు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరినట్లు భార్యకు చెప్పాడు. శ్రీధర్‌రావు హైదరాబాద్‌కు తిరిగి రాకపోవడంతో పాటు అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండడంతో శనివారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



గడ్డం సాయితేజ

పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీలో గడ్డం సాయితేజ (23) స్థానికంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 4న కంపెనీలో యాథావిధిగా డ్యూటీకి వెళ్లాడు. మరుసటి రోజు తిరిగి వస్తున్నానని కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి చెప్పాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో అన్ని చోట్లా వెతికిన కుటుంబ సభ్యులు శనివారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



ఆరెమైసమ్మ ప్రాంతంలో పనులను పరిశీలిస్తున్న నార్సింగి ట్రాఫిక్ సిఐ మధుసుధన్‌రెడ్డి, కృష్ణ

బండ్లగూడ: ప్రమాదాలను నివారించేందుకు ప్రధాన రహదారుల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటారని నార్సింగి ట్రాఫిక్ సీఐ మధుసూధన్‌రెడ్డి, కృష్ణలు వెల్లడించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఫెబల్ సిటీ, ఆరెమైసమ్మ, పీరంచెరువు కమాన్ తదితర ప్రాంతాల్లో టెంపరరీగా ఉంచిన దిమ్మెలను తొలగించి పర్మినెంట్ సెంటర్ మీడియన్ నిర్మిస్తామన్నారు. ఈ మేరకు శనివారం ఈ పనులను వారు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నియమనిబంధలను తప్పనిసరిగా పాటించాలన్నారు. రోడ్డు మధ్యలో వాహనాలతో దాటేందుకు ప్రయత్నించవద్దు అన్నారు.

విద్యార్థులు ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి



ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జాయ్ లాండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో (గ్లోబల్ డిస్కవరీ ఇంటర్నేషనల్ స్కూల్)లో ఎర్త్ ఫ్రెండ్‌షిప్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఆర్‌డివో శాస్త్రవేత్త డాక్టర్ వీరబ్రహ్మం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంవల్ల కలిగే ఎన్నో ఇబ్బందులను, సమస్యలను, కలిగే నష్టాలను విద్యార్థులు తెలుసుకొని అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రొత్సహించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ లతాలింకన్, సబీనా, ప్రధానోపాధ్యాయులు అనిత పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారులకు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంలాంటిందన్నారు. కొండాపూర్‌లోని సిద్దిఖీనగర్‌లోని నాగరాజుకు లక్ష రూపాయల, శేరిలింగంపల్లి తారానగర్‌లోని అన్నపూర్ణకు లక్ష రూపాయల, హఫీజ్‌పేట్ ఆల్విన్‌కాలనీ వాసి పద్మావతికి రెండు లక్షల, గచ్చిబౌలిలోని రాయదుర్గంలోని శోభకు రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కాశీనాథ్ యాదవ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

It is to inform to the General Public at large that My Client Smt. D. Baslingamma W/o. Sri. Nadiminti Muralidhar aged 52 years, Occupation: Govt Employee R/o. H.No. 1-5-31/60, Sainath Colony, Narayanpet, Mahabubnagar, Telangana Sate is intending to be purchased the schedule property From Smt. Dasari Basshamma W/o. Sri. Bikshapathi. She is acquired the Schedule Property through Registered Sale Deed No.444/2013 Date 22-01-2013, on the File of the at SRO, Gandipet. If anybody is claiming the schedule of property to approach my Client or at my office along with all the original documents in respect of the schedule of property within Seven (7) days from the date of publication. After the expiry of said period, My Client is not responsible for any acts.

SCHEDULE OF PROPRETY

All that the House Property bearing No: 4/4/113 on Plot Bearing No. 67, in Survey No. 51, admeasuring area 200.00 Square Yards or equivalent to 162.22 Sq. Mtrs, Situated at Mallikarjuna Colony, Bandlaguda Jagir Village and Under Bandlaguda Jagir Municipal Corporation, Gandipet Mandal, Ranga Reddy District, Telangana State and bounded by:- **BOUNDARIES**

NORTH : Plot No.66, SOUTH : 30'-0" Wide Road, EAST : 20'-0" Wide Road, WEST : Plot No. 78,

Sd/- S. CHANDRA SEKHAR, Advocate
H.No. 83-191/136 (188/C), Vengal Rao Nagar Colony, Hyderabad -500 038.
Mobile: 9247408839